



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
22-12-2025
పేజీలు: 02




బిగ్‌బాస్ తెలుగు 9 టైటిల్ గెలుచుకున్న

# కల్యాణ్ పడాల

తెలుగు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న రియాలిటీ షో బిగ్‌బాస్ సీజన్ 9 ముగిసింది. ఎన్నో నాటకీయ పరిణామాలు, ఉత్కంఠభరిత క్షణాల మధ్య జరిగిన గ్రాండ్ ఫినాలేలో కల్యాణ్ పడాల విజేతగా నిలిచారు. హోస్ట్ అక్కినేని నాగార్జున చేతుల మీదుగా ఆయన ట్రోఫీతో పాటు రూ. 35 లక్షల ప్రైజ్‌మనీ అందుకున్నారు. తనూజ రన్నరప్‌గా నిలిచారు. కల్యాణ్ కు విన్నర్ చెక్ తో పాటు బ్రాండ్ న్యూ మారుతి సుజుకి విక్టోరిస్ కారు, 'రాఫ్' నుంచి రూ.5 లక్షల చెక్ కూడా లభించడం విశేషం. ఫైనల్ రేసులో ఐదుగురు కంటెస్టెంట్లు నిలవగా, ఆదివారం జరిగిన ఫినాలేలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తొలుత నటి సంజన గల్రానీ ఐదో స్థానంతో ఎలిమినేట్ అయ్యారు. టాప్-3లో ఉంటానని భావించిన ఆమె ఈ ఫలితంతో షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత, టైటిల్ ఫేవరెట్లలో ఒకరిగా ఉన్న కమెడియన్ ఇమ్మాన్యుయేల్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఆయన ఎలిమినేషన్ అందరినీ ఆశ్చర్యపరిచింది.



# ఎయిరిండియా కీలక నిర్ణయం

ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరు, ముంబై నుంచి అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకు డైరెక్ట్ విమాన సర్వీసులను నిలివేసింది. వచ్చే ఏడాది మార్చి 1 నుంచి నాన్ స్టాప్ విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉత్తర అమెరికా నెట్‌వర్క్‌ను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా ఈ మార్పులు చేపట్టినట్లు ఎయిరిండియా తెలిపింది. విమానాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న గగనతల పరిమితుల కారణంగా పెరుగుతున్న ఆపరేషన్ ఖర్చులను నియంత్రించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. తాజా నిర్ణయం ప్రకారం ఇండియాలో కేవలం ఢిల్లీ నుంచి మాత్రమే శాన్‌ఫ్రాన్సిస్కోకు నాన్‌స్టాప్ విమాన సర్వీసులను నడిస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఢిల్లీ నుంచి వారానికి ఏడు విమానాలు శాన్‌ఫ్రాన్సిస్కోకు వెళ్తున్నాయి. వీటి సంఖ్యను 10కి పెంచుతున్నట్లు ఎయిరిండియా తెలిపింది. అలాగే ఢిల్లీ నుంచి టొరంటోకు కూడా వారానికి 10 విమానాలను నడిపించనున్నారు. భవిష్యత్తులో గగనతల పరిమితులను సడలిస్తే బెంగళూరు, ముంబై నుంచి మళ్లీ శాన్‌ఫ్రాన్సిస్కోకు నాన్ స్టాప్ సేవలను ప్రారంభించే అవకాశం ఉందని ఎయిరిండియా ప్రతినిధులు తెలిపారు.

# శ్రీలంకపై భారత్ ఘన విజయం



శ్రీలంకతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టు అదిరిపోయే బోణీ కొట్టింది. ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టీ20 పోరులో టీమ్‌ఇండియా 8 వికెట్ల తేడాతో లంకపై ఘన విజయం సాధించి 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. స్వదేశం వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో టైటిల్ గెలిచిన తర్వాత తొలిసారి బరిలోకి దిగిన భారత్ సమష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన భారత్ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. లంక నిర్దేశించిన 122 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా 14.4 ఓవర్లలో 122/2 స్కోరు చేసింది. యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్(44 బంతుల్లో 69 నాటౌట్, 10ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో కదంతొక్కింది. రోడ్రిగ్స్‌కు తోడు ఓపెనర్ స్మృతి మంధన(25) ఆకట్టుకుంది. కావ్య కవింది(1/20), ఇనోక రణవీర(1/17) ఒక్కో వికెట్ తీశారు. తొలుత లంక నిర్ణీత 20 ఓవర్లలో 121/6 స్కోరుకు పరిమితమైంది. ఓపెనర్ విశ్మి గుణరత్నె(39) ఆట్టుకోగా, మిగతావారు తేలిపోయారు. దీప్తిశర్మ(1/20), క్రాంతిగౌడ్(1/23), శ్రీచరణి(1/30) రాణించారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన జెమీమా రోడ్రిగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో టీ20 పోరు ఈనెల 23న ఇక్కడే జరుగనుంది.



ఉప్పాడ తీర ప్రాంతంలో ఫుడ్ పాయిజన్..

# 8 మందికి అస్వస్థత

ఉప్పాడ ప్రాంతంలో విషతుల్య ఆహారం కలకలం రేపింది. తీర ప్రాంతానికి చెందిన కొందరు మత్స్యకారులు అస్వస్థతకు గురవ్వడంతో ఈ విషయం వెలుగుచూసింది. వివరాల్లోకెళితే... ఉప్పాడ తీర ప్రాంతానికి చెందిన 8 మంది మత్స్యకారుల సమూహం ఇటీవల చేపల లోడింగ్ కోసం బైరవపాలెం వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో ఆకలేసి తాళ్లరేవు సమీపంలో గల ఓ హోటల్లో బిర్యానీ ఆరగించారు. ఫుడ్ పాయిజన్ కావడంతో.. అస్వస్థతకు గుర్రై వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో వారిని యు.కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు స్థానికులు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పిఠాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అయితే.. అక్కడి వైద్యులు వీరిని పరీక్షించిన తర్వాత ప్రమాదమేమీ లేదని నిర్ధారించారు. దీంతో బాధితులు సహా వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం.. వారు పిఠాపురంలో చికిత్స పొందుతున్నారు.




## మెట్రో మూడో దశ విస్తరణ..

# 178.3 కి.మీ వరకు


భాగ్యనగర వాసుల చిరకాల స్వప్నమైన వేగవంతమైన ప్రయాణాన్ని సాకారం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. కేవలం నగరంలోని ప్రధాన కూడళ్లకే పరిమితం కాకుండా.. శివారు ప్రాంతాలను కూడా అనుసంధానిస్తూ మెట్రో మూడో దశ విస్తరణకు అడుగులు పడుతున్నాయి. దీనివల్ల హైదరాబాద్ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. హైదరాబాద్ నగరం రోజురోజుకూ విశ్వనగరంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా రహదారులపై ట్రాఫిక్ రద్దీ కూడా విపరీతంగా పెరిగిపోయింది. ప్రభుత్వం ఎన్ని ఫ్లైఓవర్లు, అండర్ పాస్ వంతెనలు నిర్మించినా వాహనదారుల ఇబ్బందులు మాత్రం తొలగడం లేదు. ఈ తరుణంలో సురక్షితమైన, వేగవంతమైన మెట్రో ప్రయాణం వైపు నగర ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మెట్రో సేవలు కేవలం పరిమిత మార్గాల్లోనే ఉండటంతో.. నగరం నలుమూలల నుంచి మెట్రో విస్తరణ కోసం డిమాండ్ పెరుగుతోంది. తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా రాబోయే 22 ఏళ్లలో హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థను ఏకంగా 400 కిలోమీటర్లకు పైగా విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా రెండో దశ విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానుండగా.. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మూడో దశ విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రెండో దశలో సుమారు 152.5 కిలోమీటర్ల మేర కొత్త మార్గాలు అందుబాటులోకి వస్తాయి. ఇక మిగిలిన 178.3 కిలోమీటర్లు మూడో దశలో విస్తరించనున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న ప్రాంతాలకు మెట్రో అనుసంధానం ఏర్పడుతుంది. ప్రస్తుతం సిటీ బస్సుల్లో ఒక చివర నుండి మరో చివరకు వెళ్లాలంటే ట్రాఫిక్ కారణంగా సుమారు మూడు గంటల సమయం పడుతోంది. మూడో దశ పూర్తయితే.. శివారు ప్రాంతాలైన మేడ్చల్, పటాన్ చెరువు, ఘటకేసర్, హయాత్ నగర్ వంటి ఏరియాల నుంచి విమానాశ్రయానికి లేదా ఐటీ కారిడార్లకు నిమిషాల వ్యవధిలోనే చేరుకోవచ్చు. ప్రస్తుతం నగరంలో 69.2 కిలోమీటర్ల మేర మెట్రో సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించుకున్న 400 కిలోమీటర్ల మైలురాయిని చేరుకోవాలంటే ఇంకా 330.8 కిలోమీటర్ల మేర పట్టాలు వేయాల్సి ఉంటుంది. అంటే 2047 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలంటే, వచ్చే ఏడాది నుంచి ప్రతి సంవత్సరం సగటున 15 కిలోమీటర్ల మేర కొత్త మెట్రో మార్గాన్ని నిర్మించాల్సి ఉంటుంది. ఇది ఒక భారీ సవాల్ అయినప్పటికీ.. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి సకాలంలో పనులు పూర్తి చేయాలని యోచిస్తున్నారు. మెట్రో మూడో దశ విస్తరణ వల్ల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, కాలుష్యం కూడా గణనీయంగా తగ్గుతుంది. సొంత వాహనాల వాడకం తగ్గి, మెట్రో రైళ్లలో ప్రయాణించడం వల్ల ఇంధన ఆదా కూడా సాధ్యమవుతుంది. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులు, విద్యార్థులకు ఈ విస్తరణ ఎంతో ఊరటనిస్తుంది. 2047 నాటికి హైదరాబాద్ నగరం మొత్తం మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధానమై.. ప్రపంచ స్థాయి రవాణా సదుపాయం కలిగిన నగరంగా నిలవనుంది.

# మృణాల్ హాట్ లుక్స్

సినిమా తారలు, స్టార్ క్రికెటర్ల మధ్య ప్రేమ వ్యవహారాలు నడుస్తున్నాయంటూ వార్తలు నిత్యం వినిపిస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్, టీమిండియా క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌తో ప్రేమలో ఉన్నారనే గాసిప్ ఒకటి మొదలైంది. అంతకుముందు కోలీవుడ్ నటుడు ధనుష్‌తో కూడా మృణాల్‌కి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని వార్తలు వచ్చాయి. ఈ ప్రచారాలన్నింటిపైనా మృణాల్ ఠాకూర్ స్పష్టతనిచ్చారు. ధనుష్ తనకు కేవలం మంచి స్నేహితుడు, వెల్ విషర్ అని మృణాల్ గతంలోనే స్పష్టం చేశారు.




# ది లాస్ట్ షో రివ్యూ




ప్రతీ వారం లానే ఈ వారం కూడా మన తెలుగు స్ట్రీమింగ్ యాప్ ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కి వస్తున్న కథా సుధా వీక్లీ సిరీస్ నుంచి వచ్చిన తాజా లఘు చిత్రమే "ది లాస్ట్ షో". మరి ఈ షార్ట్ ఫిలిం ఎలా ఉందో సమీక్షలో చూద్దాం రండి. ఒక రేడియో జాకీగా పని చేసే ఆద్య (ధీరా పిసాటి) తనకి బ్రేకప్ కావడంతో పెళ్లిపై అంత ఇంట్రెస్ట్ చూపించదు. తన మాజీ ప్రియుడు వరుణ్ (చరణ్ లక్కరాజు) నుంచి బయటకి రాలేక సతమతం అవుతుంది. కానీ వరుణ్ మాత్రం బ్రేకప్ తర్వాత పెళ్ళికి రెడీ అయ్యాడని తెలుసుకొని ఆమె కూడా పెళ్లికి ఓకే చెప్పేస్తుంది. ఆ నిర్ణయంతోనే రేడియో జాకీగా కూడా ఒక లాస్ట్ షో చేయాలని డిసైడ్ అవుతుంది. కానీ మళ్ళీ ఇద్దరూ ఎలా కలిశారు? అందుకు దోహదపడ్డ పరిస్థితులు ఏంటి? అసలు ఎందుకు ఈ ఇద్దరూ విడిపోయారు అనేది తెలియాలి అంటే ఈ సినిమా చూడాలి. ఈ చిత్రంలో యువ నటీనటులు ఇద్దరూ మంచి పెర్ఫామెన్స్ లని అందించారు అని చెప్పొచ్చు. చరణ్, ధీరా ఇద్దరూ తమ పాత్రల్లో సూటయ్యి మంచి సెన్సిబుల్ నటనను కనబరిచారు. ఇద్దరు ప్రేమికుల్లా అందులో ఉండే ఎమోషన్ ని పలికించారు. అలాగే నటుడు గిరిధర్ కూడా తన రోల్ కి సూటయ్యారు. అలాగే ఈ సినిమా ఎక్కువగా ఒక నీట్ లవ్ స్టోరీస్ లాంటి వాటిని ఇష్టపడేవారికి బాగా కనెక్ట్ అవుతుంది. అలాగే వీరి లవ్ ట్రాక్ లో మనస్పర్థలు చివరిలో ఎండింగ్ మీనింగ్ ఫుల్ గా ఉంది. అలాగే క్లైమాక్స్ ఎండింగ్ కూడా డీసెంట్ గా ఉంది. ఇదొక డీసెంట్ అటెంప్ట్ అయినప్పటికీ ఎమోషన్స్ పరంగా ఇంకా స్ట్రాంగ్ గా ఉండాల్సింది. మధ్యలో ఆడియెన్స్ కొంచెం డీవియేట్ అవుతారు. కొంచెం స్లోగా సాగే కథనం కూడా మరో మైనస్ అని చెప్పొచ్చు. అలాగే ఈ తరహా ట్రీట్మెంట్ తో కూడిన సినిమాలు లాంటివి ఆల్రెడీ చాలానే ఉన్నాయి కాబట్టి ఇందులో మరీ అంత కొత్తదనం కనిపించదు. ఈ సినిమాలో నిర్మాణ విలువలు బాగానే ఉన్నాయి. సంగీతం డీసెంట్ గా ఉంది. కెమెరా వర్క్ కూడా బాగుంది. ఎడిటింగ్ కూడా పర్వాలేదు. దర్శకుడు ప్రదీప్ మద్దాలి వర్క్ పర్వాలేదు అని చెప్పొచ్చు. రొటీన్ ప్రేమ కథనే డీసెంట్ గా మంచి ట్విస్ట్ తో ప్రెజెంట్ చేసే ప్రాసెస్ ని ఇంకా బెటర్ గా ప్లాన్ చేసుకొని ఉంటే బాగుండేది. ఇక మొత్తంగా చూసుకున్నట్టయితే ఈ "ది లాస్ట్ షో" మాత్రం స్ట్రిక్ట్ గా లవ్ కంటెంట్ ని ఇష్టపడేవారికి కనెక్ట్ అవుతుంది అని చెప్పొచ్చు. లీడ్ నటీనటులు మంచి పెర్ఫామెన్స్ లు అందించారు. కాకపోతే మిగతా ఆడియెన్స్ లో మాత్రం అంత ఇంపాక్ట్ కలిగించలేకపోవచ్చు. సో ఓ సింపుల్ అండ్ మంచి ఎండింగ్ కోరుకునే లవ్ డ్రామా చూడాలి అనుకునేవారికి ఇది పర్వాలేదు అనిపిస్తుంది.


# నేటి నుంచి తెలంగాణ టీ20 టోర్నీ



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ టీ20 లీగ్‌కు సోమవారం తెరలేవనుంది. మహబూబ్‌నగర్ వేదికగా టీ20 టోర్నీ తొలి అంచె పోటీలు మొదలుకానున్నాయి. జిల్లా కేంద్రంలోని మైదానంలో మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జట్ల మధ్య మొదటి మ్యాచ్ జరుగనుంది. ఈనెల 27 వరకు జరిగే తొలి దశలో హైదరాబాద్, రంగారెడ్డి మినహా 29 జిల్లాల జట్లు పోటీపడుతున్నాయి. వీటి నుంచి ఎనిమిది ఉమ్మడి జిల్లాలకు తోడు హైదరాబాద్, రంగారెడ్డి జట్లతో రెండో అంచె పోటీలు ఈనెల 29 నుంచి జనవరి 17 వరకు 49 మ్యాచ్‌లు జరుగుతాయి.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# తూ మేరీ మై తేరా అనన్య



బాలీవుడ్ యువ నటీనటులు కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ'. ఈ సినిమాకు సమీర్ విద్వాన్స్ దర్శకత్వం వహిస్తుండగా.. 'సత్యప్రేమ్ కి కథ' చిత్రం తర్వాత కార్తీక్ - సమీర్ కాంబోలో వస్తున్న రెండో చిత్రమిది. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్‌కి చెందిన ధర్మ ప్రొడక్షన్స్, నమః పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.

# అందరూ చూస్తుండగానే.. బాలికను రైలు కిందకు తోసేశారు!



మహారాష్ట్ర రాజధాని ముంబైలో దారుణం వెలుగులోకి వచ్చింది. పన్వేల్ — ఖండేశ్వర్ రైల్వే స్టేషన్ల మధ్య లోకల్ రైలులో ఒక షాకింగ్ సంఘటన జరిగింది. 18 ఏళ్ల కాలేజీ అమ్మాయిని కదులుతున్న రైలు నుండి తోసేశారు. ఈ సంఘటనలో ఆ బాలిక తీవ్రంగా గాయపడింది. ఆదివారం (డిసెంబర్ 21) ఉదయం 8 గంటల ప్రాంతంలో CSMTకి వెళ్లే లోకల్ రైలులోని ఈ ఘటన చోటు చేసుకుంది. మహిళల కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తుండగా ఈ సంఘటన జరిగింది. లోకల్ రైలు బయలుదేరిన వెంటనే, 50 ఏళ్ల షేక్ అక్తర్ నవాజ్ లేడీస్ కంపార్ట్‌మెంట్ ఎక్కాడు. మహిళలు అతన్ని దిగమని అడిగినప్పుడు, అతను వారితో వాదించడం ప్రారంభించాడు. వాదన తీవ్రమవుతుండటంతో, నిందితుడు కోపంగా ఒక అమ్మాయిని వెనుక నుండి బయటకు తోసేశాడు. దీంతో ఆమె నేరుగా పట్టాలపై పడిపోయింది. దీంతో ఆ బాలిక తల, నడుము, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన తర్వాత, ఆమె తన తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించింది. స్థానికులు బాలికను గుర్తించి, వెంటనే ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. ఈ సంఘటనలో నిందితుడైన అక్తర్ నవాజ్ ఖండేశ్వర్ స్టేషన్‌లో దిగి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, అప్రమత్తమైన ప్రయాణికులు అతన్ని పట్టుకుని రైల్వే పోలీసులకు అప్పగించారు. పన్వేల్ రైల్వే పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. కోర్టు అతన్ని మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. సీనియర్ పోలీస్ ఇన్స్పెక్టర్ విజయ్ టేడే ప్రకారం, నిందితుడు షేక్ అక్తర్ నవాజ్ ఒంటరిగా నివసిస్తున్నాడు. అతనికి బంధువులు లేరు. అతను తరచుగా రైళ్లలో ప్రయాణిస్తుంటాడు. ప్రాథమిక దర్యాప్తులో అతను మానసికంగా అస్థిరంగా ఉండవచ్చని సూచిస్తున్నాయి. ఇదే అతన్ని ఈ భయంకరమైన నేరానికి దారితీసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మోదీ తర్వాత ప్రధాని రేసులో చంద్రబాబు లేదా లోకేష్



ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ సంచలన విశ్లేషణను బయటపెట్టింది. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి భారత ప్రధాని మోదీ వయస్సు 79 ఏళ్లకు చేరుతుందని, ఆ సమయంలో ఆయన క్రియాశీల రాజకీయాల నుండి తప్పుకుంటే వారసులెవరు అనే కోణంలో ఒక ఆసక్తికర అనాలసిస్ చేసింది. భారత ప్రధాని రేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పేర్లను ప్రస్తావించింది. ఒకవేళ 2029లో బిజెపికి స్పష్టమైన మెజారిటీ రాకుండా, ఎన్డీయే కూటమిలోని ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటే, అప్పుడు దక్షిణాది నేతగా చంద్రబాబుకు, లేదా నారా లోకేష్‌కు అవకాశం దక్కవచ్చని రాయిటర్స్ అభిప్రాయపడింది. రాయిటర్స్ వెలువరించిన విశ్లేషణ ప్రకారం, బిజెపిలో మోదీ తర్వాత అత్యంత శక్తివంతమైన నేతగా ఉన్న అమిత్ షా మొదటి వరుసలో ఉన్నారు. తర్వాత మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ పేరును కూడా రాయిటర్స్ పరిగణనలోకి తీసుకుంది. అయితే, క్షేత్రస్థాయిలో అత్యంత ప్రజాదరణ పొందిన యోగి ఆదిత్యనాథ్ పేరును రాయిటర్స్ విస్మరించింది. మోదీ తర్వాత అంతటి ఫాలోయింగ్ ఉన్న నేతను కాదని ఫడ్నవీస్ పేరును తెరపైకి తేవడం వెనుక రాయిటర్స్ లాజిక్ ఏంటన్నది ప్రశ్నార్థకం.

## లవర్‌తో కలిసి భర్తను చంపి ముక్కలు చేసి.. పాలిథిన్ కవర్లలో



ఉత్తర్‌ప్రదేశ్, అలీగఢ్‌లోని లోథా ప్రాంతంలో జరిగిన ఎలక్ట్రీషియన్ హత్య కేసులో పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు. ఈ కేసులో మృతుడి భార్యతో సహా ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.మరో ఇద్దరు పరారీలో ఉన్నారని.. త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రేమ వ్యవహారమే హత్యకు కారణం తేలింది. ప్రియుడు అతని స్నేహితులతో కలిసి భర్తను అత్యంత పాశవికంగా హత్య చేసి.. మృతదేహాన్ని ముక్కలుగా నరికి, పాలిథిన్ సంచుల్లో ప్యాక్ చేసి పలు ప్రాంతాల్లో పారవేసినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. ఛందౌసియాలోని పాత్రోవా రోడ్డులో ఈద్గా వెలుపల పాలిథిన్ సంచిలో చుట్టబడ్డ యువకుడి మృతదేహం కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. యువకుడి తల, చేతులు, కాళ్లు నరికివేయబడ్డాయి. పోలీసులు, ఫోరెన్సిక్ బృందంతో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా మొహల్లా చున్నీ నివాసి రాహుల్‌గా గుర్తించారు. ఇటీవల రాహుల్ కనిపించడం లేదని అతని భార్య రూబీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూబీని పోలీసులు తమదైన స్టైల్లో విచారణ చేయగా సంచలన విషయాలు బయటపెట్టింది. తన ప్రియుడు గౌరవ్ అతని స్నేహితులతో కలిసి హత్య చేసినట్లు ఒప్పుకుంది. రూబీ, గౌరవ్ తో పాటు వాళ్లకు సహాయపడ్డ నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.



## కొండెక్కిన కోడి గుడ్లు, చికెన్ ధరలు

నాన్‌వెజ్ ప్రియులకు ఇది బ్యాడ్‌న్యూస్ అనే చెప్పవచ్చు. ఇప్పటికే కోడి గుడ్ల ధరలు పెరుగుతోండగా.. దానితో పాటు చికెన్ ధరలు కూడా భగ్గుమంటున్నాయి. త్వరలో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి లాంటి ప్రధాన పండుగలు వస్తుండటంతో వివిధ ప్రాంతాలకు కోళ్ల సరఫరా పెరిగిపోయింది. దీంతో డిమాండ్ కారణంగా చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. దాణా ఖర్చులు పెరుగడంతో కోళ్ల ఫామ్స్ నిర్వహణ కూడా యజమానులకు కష్టంగా మారిపోయింది. దీంతో ధరల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. గుడ్లు, చికెన్ ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇంటి ఖర్చు పెరుగుతోంది. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మరికొన్ని రోజుల పాటు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని తెలుస్తోంది. నెల క్రిందట గుడ్డు ధర రూ.5 ఉండగా.. ఇప్పుడు ఏకంగా రూ.3 పెరిగి రూ.8కి చేరుకుంది. హోల్‌సెల్ మార్కెట్లో రూ.7.50గా ఉండగా.. రిటైలర్లు రూ.8కి విక్రయిస్తున్నారు. ఇక నాటుకోడి గుడ్డు ధర రూ.15 పలుకుతోంది. ఇక వీటితో పాటు చికెన్ ధరలు కూడా అమాంతం పెరిగాయి. నెలలోనే రూ.100 మేర కేజీ చికెన్ ధర పెరిగింది. నెల క్రితం రూ.190 నుంచి రూ.200 మధ్య కేజీ చికెన్ ధర కొనసాగింది. ఈ నెల ప్రారంభంలో రూ.230 వరకు చేరుకోగా.. ఆదివారం నాటికి రూ.290కి చేరుకుంది. దీంతో నెల రోజుల్లో రూ.100 మేర చికెన్ ధర పెరిగినట్లయింది. పండుగల సీజన్ కావడంతో చికెన్‌కు ఫుల్ డిమాండ్ పెరగడం, డిమాండ్‌కు తగ్గట్లు కోళ్ల ఫామ్స్ నుంచి కోళ్లు రాకపోవడంతో ధరలు పెంచుతున్నారు.




## బంగ్లాదేశ్‌లో హింస సర్వసాధారణమైంది.. నియంత్రించే శక్తి యూనస్ ప్రభుత్వానికి లేదు

మన పొరుగు దేశం బంగ్లాదేశ్ మరోసారి భగ్గుమంది. ఇటీవల కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న విద్యార్థి, తిరుగుబాటు నాయకుడు, భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు చేసే షరీఫ్ ఉస్మాన్ హాది (32) మరణించడంతో ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు గురు, శుక్రవారాల్లో దేశంలో పలుచోట్ల నిరసనలు చేపట్టడంతో హింస, విధ్వంసం చోటు చేసుకుంది. అల్లర్లలో ఒక హిందువు హత్యకు గురి కాగా, పలువురు నిరసనకారులు, పౌరులు గాయపడ్డారు. ప్రస్తుతం ఆ దేశంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ఉద్రిక్తతలపై ఆదేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తాజాగా స్పందించారు. ఈ మేరకు యూనస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. బంగ్లాదేశ్‌లో హింస అనేది సాధారణ విషయంగా మారిందని.. దేశంలో హింసను నియంత్రించడంలో తాత్కాలిక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హసీనా మాట్లాడుతూ. 'ఉస్మాన్ బిన్ హాదీ హత్య అనంతరం ఢాకాలో నెలకొన్న హింస దేశాన్ని మరితం అస్థిరపరుస్తోంది. ఈ హత్య నా ప్రభుత్వాన్ని కూల్చివేసి, యూనస్ పాలనలో పెరిగిపోయిన అక్రమాన్ని ప్రతిబింబిస్తోంది. నన్ను బహిష్కరించినప్పటి నుంచి దేశంలో పరిస్థితి మరింత దిగజారింది. యూనస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో హింస పెరిగిపోయింది. హింసను ఆపడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. నిరంతర హింస బంగ్లాదేశ్‌ను అంతర్గతంగా అస్థిరపరుస్తోంది.

## ఘోర బస్సు ప్రమాదం.. 15 మంది దుర్మరణం

ఇండోనేషియాలోని సెంట్రల్ జావా ప్రాంతంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఈ రోజు (సోమవారం) తెల్లవారుజామున సెమరాంగ్ నగరంలోని క్రాప్యాక్ టోల్ గేట్ వద్ద ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే మృతి చెందగా మరో 20 మందికి తీవ్ర గాయాలు కావడంతో దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాలు మొదలు పెట్టారు. ప్రమాదం జరిగే సమయానికి బస్సు అత్యంత వేగంగా వెళ్తోందని స్థానిక అధికారులు తెలిపారు. క్రాప్యాక్ టోల్ ఎగ్జిట్ కూడలి వద్దకు రాగానే బస్ డ్రైవర్ నియంత్రణ కోల్పోయి డివైడర్‌ని ఢీ కొట్టడంతో బస్సు బోల్తా పడింది. చాలా మంది బాధితులు బస్సు లోపలే ఇరుక్కుపోయారని, కిటికీ అద్దాలు పగిలి లోపలికి వెళ్లడానికి రెస్క్యూ టీమ్ ఇబ్బంది పడుతుందని అధికారి తెలిపారు.






## వీసా ఫీజు పెంపు

హెచ్-1బీ వీసా అనగానే ముందుగా గుర్తొచ్చేది ఐటీ ఉద్యోగులు, డాక్టర్లే. కానీ ట్రంప్ హెచ్-1బీ వీసా ఆంక్షల కారణంగా కాలిఫోర్నియా రాష్ట్రంలో టీచర్‌లకు కొరత మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉంది. దీంతో, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమెరికా కేంద్ర ప్రభుత్వంపై కోర్టులో కేసు కూడా వేసింది. టెక్సాస్, నార్త్ కెరోలీనా తరువాత అత్యధిక సంఖ్యలో హెచ్-1బీ టీచర్లు కాలిఫోర్నియాలోనే ఉన్నారు. కాలిఫోర్నియా రాష్ట్రం ఇప్పటికే టీచర్ల కొరతతో సతమతం అవుతోంది. ముఖ్యంగా కే-12 స్కూళ్లల్లో టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. ఫలితంగా 2023లో అక్కడి ప్రభుత్వం 46,982 పోస్టుల్లో పూర్తిస్థాయి అర్హతలు లేని వారిని నియమించుకోవాల్సి వచ్చింది. ఇంత చేసినా ఆ ఏడాది 22,012 పోస్టుల భర్తీ సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో అక్కడి స్కూళ్లు విదేశీ టీచర్ల వైపు మళ్లుతున్నాయి. ముఖ్యంగా ఫిలిప్పీన్స్, స్పెయిన్, మెక్సికోకు చెందిన టీచర్లకు హెచ్-1బీ వీసాలను స్పాన్సర్ చేసి నియమించుకున్నాయి.

## కేసీఆర్ విమర్శలు.. రంగంలోకి సీఎం రేవంత్ రెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విమర్శలు సంధించిన నేపథ్యంలో వాటిని ఎలా తిప్పి కొట్టాలనే అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సమయత్తమవుతున్నారు. అందుకోసం సోమవారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. కేసీఆర్ విమర్శలను ఎలా తిప్పికొట్టాలనే అంశంపై మంత్రులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే పంచాయతీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించనున్నారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై సైతం ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరో వైపు డిసెంబర్ 27వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ఖరారైంది. ఆ రోజు జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొనున్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై ఏఐసీసీ నేతలతో సీఎం రేవంత్ చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## వీకెండ్ డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్.. చిక్కిన మందు బాబులు



హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్లలో పోలీసులు వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 403 మంది, సైబరాబాద్‌లో 409 మంది పట్టుబడ్డారని, వారిపై కేసులు నమోదు చేశామని అధికారులు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. హైదరాబాద్ లో పట్టుబడిన వారిలో 320 మంది ద్విచక్రవాహనదారులు, 23 మంది ఆటో డ్రైవర్లు, 59 మంది కార్లు, భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. సైబరాబాద్ లో 290మంది ద్విచక్రవాహనదారులు, 23మంది ఆటో డ్రైవర్లు, 95 మంది కార్లు నడుపుతున్న వారు, భారీ వాహనం డ్రైవర్ ఉన్నారని పేర్కొన్నారు. సైబరాబాద్ కేసులను విచారించిన న్యాయస్థానం ఇద్దరికి జరిమానా, జైలు శిక్ష, సామాజిక సేవ చేయాలని తీర్పు చెప్పిందని పోలీసులు తెలిపారు.